ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 25.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు

5

మంగళవారం 10 సెప్టెంబరు 2024



పెద్దయడ్లగాడి నుంచి పెనుమాకలంకకు పడవపై వెళ్తున్న గ్రామస్థులు

జల దిగ్బంధం

కొల్లేరు గ్రామాలను చుట్టేస్తున్న వరద



ముంపులో చిక్కుకున్న మండవల్లి వైఎస్సార్‌కాలనీ

- ముంపులో కొల్లేటి లంక గ్రామాలు
- నీట మునిగిన రహదారులు.. రాకపోకలు బంద్
- మంచినీళ్ల కోసం లంకవాసుల అవస్థలు
- ఉప్పుటేరును పరిశీలించిన ఎమ్మెల్యేలు, పశ్చిమ కలెక్టర్
- ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కామినేని భరోసా

మండవల్లి/ కైకలూరు/ ఏలూరు రూరల్, సెప్టెంబరు 9 : కొల్లేరును వరద ఉధృతి చుట్టుముట్టేస్తోంది. బుడమేరు, తమ్మిలేరుతో పాటు వివిధ డ్రెయిన్ల ద్వారా ఎగువ నుంచి వరద కొల్లేరుకు చేరడంతో కొల్లేరు నీటిమట్టం పెరుగుతోంది. పెద్దఎడ్లగాడి వద్ద ఆదివారం 3.36 మీటర్ల ఉన్న కొల్లేరు సోమవారం 3.40 మీటర్లకు చేరుకుంది. ఇప్పటికీ కొల్లేటి లంక గ్రామాలు వెళ్లే రహదారులు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొల్లేటిలంక గ్రామాలైన మండవల్లి మండలం పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు వంటి గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పడవల ద్వారా రాకపోకలు సాగించడం తప్ప మరో మార్గం లేదు. మంచినీళ్ల కోసం కొల్లేటివాసులు అవస్థలు పడుతున్నారు. ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగర్ వరకు ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆర్థిక సాయంతో మంచినీటి ట్యాంకులు ద్వారా మినరల్ వాటర్ సరఫరా చేస్తు న్నారు. పెనుమాకలంకకు మాత్రం మంచినీళ్లు అందడం లేదని, ఉన్న మంచినీటి వసతి ముంపు నీటిలో చిక్కుకుపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరు నీటిమట్టం పెరగడంతో కొల్లేటి ఎగువ గ్రామాలైన ఉనికిలి, మూలపేట, నాగభూషణపురం వరకు ముంపు పరిస్థితి ఏర్పడింది. మండవల్లి సమీపంలో పల్లపు ప్రాంతాల్లోని గృహాలు నీట మునిగాయి. వైఎస్సార్‌కాలనీ పూర్తిగా ముంపు నీటిలో చిక్కుకుంది. చేపల చెరువులకు వెళ్లే రహదారులు పూర్తిగా నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లోని చెరువులు గట్లు ముంపునకు గురై రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. చెరువు గట్లపై చేపలు బయటకు వెళ్లకుండా వలలతో కట్టడి చేస్తున్నారు.

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

విపత్తుల సమయంలో ప్రజలు ధైర్యంగా ఉండాలని, ముంపు నివారణకు శాయశక్తుల కృషి చేస్తానని, ప్రజలకు అండగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. సోమవారం కైకలూరు మండలం పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, గుమ్మళ్లపాడు, చటాకాయ్ గ్రామాల్లో ముంపును అటవీశాఖ డివిజనల్ ఫారెస్ట్ అధికారి రవిశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తలు వహించాలని కామినేని సూచించారు. ఇళ్లు ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారాలను అందజేస్తామని, పందిరిపల్లిగూడెంలో మంచినీటి చెరువు ముంపులో కలిసిపోయినందున ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పశువులకు పశుగ్రాసాన్ని అందించేందుకు కలెక్టర్‌తో



కైకలూరు మండలంలో ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, కనుమూరి, పశ్చిమ కలెక్టర్ నాగరాణి

మాట్లాడానన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీలో డాక్టర్లు 24 గంటలపాటు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీరోజు గ్రామాల్లోకి అధికారులు వచ్చేందుకు ప్రత్యేక బోట్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కూటమి నాయకలు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, పలువురు అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముంపు బారిన చేపల చెరువులు

కొల్లేరు సరస్సుకు రోజురోజుకు వరద ఉధృతి పెరగడంతో రహదారులు పూర్తిగా జలమయంగా మారాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చేపల చెరువులు ముంపు బారినపడి వరద నీటిలో కలిసిపోతుండడంతో రైతులు లక్షల్లో నష్టాలను చవి చూస్తున్నారు. కొంతమంది వచ్చిందే చాలు అన్నట్లుగా హడావుడిగా చేపలు, రొయ్యలను పట్టుబడులను చేస్తున్నారు. కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం వద్ద ఉప్పుటేరులో ఉన్న రైల్వే బ్రిడ్జి, రోడ్డుబ్రిడ్జి వద్ద గుర్రపుడెక్క, కిక్కిసను కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు నిరంతరంగా పర్యవేక్షిస్తూ చెత్త తొలగింపు పనులను చేపట్టారు. సోమవారం ఉప్పుటేరు వద్ద ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, రఘురామకృష్ణంరాజులతో పాటు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి ఉప్పుటేరును పరిశీలించి ముంపు నివారణ చర్యలకు పలు సూచనలు చేశారు.

ముంపులోనే మొండికోడు, గుడివాకలంక

ఏలూరు రూరల్ మండలంలోని మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక గ్రామాల్లో వరదనీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉండడంతో అధికారులు రాకపోకలను నిషేధించారు. సోమవారం వరద ఉధృతి పెరగడంతో ఉదయం లంక గ్రామమైన మాధవరం రోడ్డుపైకి పెద్దఎత్తున వరదనీరు ప్రవహిస్తూ ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు



మాధవరం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే మండలంలోని గ్రామాల్లో వరద ప్రవాహానికి వందలాది చేపల చెరువులు నీటమునిగాయి. కోట్ల విలువైన చేపలు కొల్లేరు పాలైయ్యాయి. చెరువుల్లో చేపలను కాపాడుకునేందుకు యజమానులు అవస్థలు పడుతున్నారు.

నిత్యావసర వస్తువులు అందించాలి : కలెక్టర్

ఏలూరు సిటీ : జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులందరికీ నిత్యావసర వస్తువులు అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరద పరిస్థితి , నిత్యావసర వస్తువులు పంపిణీపై అధికారులతో సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో వరద ప్రభావానికి గురై నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కొల్లేరు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో వరద నీటిలో ఇళ్లు ముంపునకు గురైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు , తాగునీరు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అధికార సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి , విష జ్వరాలతో బాధపడే వారిని గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించే దిశగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ముంపు అంచున చేపల చెరువులు

నేడు ఆ మండలాల్లోని కొన్ని పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్ : వర్షాలు, వరద ముంపు నేపథ్యంలో జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో పాఠశాలల నిర్వహణకు అనువైన పరిస్థితులు లేనట్టుగా సంబంధిత ఎంఈవోలు నివేదికలు పంపిన దృష్ట్యా సంబంధిత స్కూళ్లకు మంగళవారం స్థానిక సెలవు (లోకల్ హాలీడే)ను ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మండవల్లి మండలంలో 18 పాఠశాలలు, కైకలూరు 9, పెదపాడు 7, కలిదిండి 5, ముదినేపల్లి 3, భీమడోలు, ఏలూరు మండలాల్లో ఒక్కొక్క పాఠశాల చొప్పున లోకల్ హాలిడే ఇచ్చినట్టు వివరించారు. ఈ ఏడు మండలాల్లోని మిగతా పాఠశాలలతో పాటు, మిగిలిన మండలాల్లో అన్ని పాఠశాలలు యథాతథంగా పనిచేస్తాయన్నారు.



మండవల్లి మండలంలో మంచినీటి కోసం బైక్‌పై వెళ్తున్న యువకులు

మళ్లీ పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు : గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 29.6 అడుగుల నీటిమట్టం నమోదైంది. తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులన్నీ నిండాయి. శబరి ఉధృతంగా ఉంది. సమ్మక్క బ్యారేజ్, తాళిపేరు ప్రాజెక్టు నుంచి భారీ స్థాయిలో జలాలను కిందకు వదులుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 43 అడుగులకు గోదావరినీటి మట్టం చేరుకునే అవకాశం ఉందని తెలంగాణ అధికారులు అంచనా వేస్తున్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

చింతలపూడి : చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు కొనసాగుతోంది. రెండురోజులుగా పడిన వర్షాల వల్ల పరీవాహక ప్రాంతా ల్లోని నీరుకూడా చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 347.49 అడుగుల కు చేరింది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో 3,350 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువకు 4,773 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

ఎమ్మెల్యే కామినేనికి తప్పిన ప్రమాదం

సర్కారు కాల్వ వద్ద నుంచి కొల్లేరు లంక గ్రామాలను పరిశీలించేందుకు సోమవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బొల్లెరో వ్యానులో వెళ్తుండగా రోడ్డుపై గొయ్యిలో పడి పెద్దశబ్దంతో పక్కకు ఒరిగిపోయింది. అప్రమత్తమైన మిగిలిన నాయకులు, అధికారులు వ్యాను నుంచి ఎమ్మెల్యేతో పాటు ఒక్కొక్కరిని కిందికి దించారు. వ్యాను నడుపుతున్న రాష్ట్ర వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు వ్యాను ను కొద్దిసేపటికి రహదారి పైకి తీసుకురాగా అనంతరం ఎమ్మెల్యే పర్యటనను యథా విధిగా కొనసాగించారు.



జిల్లాలో భారీ వర్షాలు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 9 : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 64.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 26.6 మి.మీగా నమోదైంది. పోలవరం 63.4, కొయ్యలగూడెం 56.8, లింగపాలెం 43.4, బుట్టాయిగూడెం 35.4, చాట్రాయి 34.2, కామవరపుకోట 32.2, చింతలపూడి 32, పెదవేగి 31.6, టి.నరసాపురం 31.2, జంగారెడ్డిగూడెం 31, భీమడోలు 30.2, ద్వారకా తిరుమల 27.2, కుక్కునూరు 24.2, దెదులూరు 24, జీలుగుమిల్లి 21.4, ఉంగుటూరు 19.4 నిడమర్రు 19.2, నూజివీడు 18.6, ముసునూరు 16.8, ఏలూరు అర్బన్ 14.4, ఏలూరు రూరల్ 13, కైకలూరు 11.6, ఆగిరిపల్లి 10.4, పెదపాడు 10.2, ముదినేపల్లి 9.4, మండవల్లి 9.4, కలిదిండి 9 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

రేపటి నుంచి కొత్త మార్గదర్శకాలతో..

ఉచిత ఇసుక

- ఇసుక రవాణా చేసే వాహనాలను ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి
- కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 9: ఇసుక రవాణా చేసే వాహనాలను ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇసుక సమన్వయ శాఖల అధికారులు, లారీ యజమానులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాలసీపై అవగాహన కల్పించారు. సెప్టెంబరు 11వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత ఇసుక విధానంలో కొత్త మార్గదర్శకాల మేరకు పంపిణీ విధానం అమలులోకి వస్తుందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీ తనంతో ఉచిత ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లారీ యాజమాన్యాలు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇంత వరకు 60 వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. నూతన ఇసుక విధానం ప్రజలకు మేలు జరిగేలా ట్రాన్స్‌పోర్టర్లు సహకరించాలన్నారు. లారీ యజమానులు ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి రవాణా చార్జీలు, తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో మరిన్ని ఇసుక డి సిల్టింగ్ చేపట్టేందుకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశంలో ఆమోదించారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 11 వతేదీ నుంచి కొత్త ఇసుక పాలసీ విధానంలో అమలు చేయాల్సిన విధి విధానాలను వివరించారు. మైనింగ్ డీడీ రవికుమార్, ఉపరవాణా కమిషనర్ శాంతకుమారి, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు, ఆర్డీవో శ్రీహరి, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, సెబ్ అధికారులు పాల్గొన్నారు.


డైనమిక్.. బాస్‌లు

- జిల్లాకు కలిసొచ్చిన యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు
- భారీ వర్షాలు, వరదల్లోను సమష్టి బాధ్యత
- ఎక్కడికక్కడ కదిలిన అధికార యంత్రాంగం
- ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు

ఐదేళ్లపాటు సాగిన నిర్లక్ష్యం ఈ రెండు నెలల్లోనే మటుమాయం. ఆ స్థానంలో ఉత్సాహం, చురుకుదనం, సమష్టి కార్యాచరణ. ఎక్కడైతే కష్టం వచ్చిందో అక్కడ క్షణాల్లో వాలిపోవడమే లక్ష్యం. కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి కార్య రంగంలోకి దింపడం మరో టార్గెట్. భారీ వర్షాలు, పొంగుకొస్తున్న వాగులు, వంకలు, ఆ వెంటనే తరుముకొచ్చిన గోదావరి వరదలు. 40 ఏళ్ల తర్వాత ఒక్కసారిగా తెగిపడిన నూజివీడు పెద్ద చెరువు సృష్టించిన బీభత్సం, పెదపాడులో బుడమేరు వీరంగం, ఉప్పొంగిన కొల్లేరు.. వీటన్నింటిలోనూ జిల్లా యంత్రాంగం తనదైన శైలిలో క్షణాల్లో స్పందించింది. అర్ధరాత్రి దాటినా కార్యరంగంలోనే బిగ్‌బాస్‌లు. ప్రాణ నష్టం లేకుండా నివారించడంలో వీరంతా పడిన కష్టం ఇప్పుడు జిల్లా ప్రజల చేత శభాష్ అనిపించుకుంటుంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

కష్టాల్లోనూ జనం చెంతే..



కుక్కునూరు, వేలేరుపాడులలో గడిచిన రెండు నెలల్లో వరుసగా గోదావరి వరదలు తరుముకొచ్చి ముంచెత్తినప్పుడు కలెక్టర్ వెట్రిసెల్వి వేగంగా స్పందించారు. మండల అధికారులతో పాటు స్పెషల్ అధికారులను అప్రమత్తం చేశారు. నిండు గోదావరిలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రయాణించి ముంపునకు గురైన గ్రామాలను ధైర్యంగా సందర్శించారు. వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రాజెక్టు కొట్టుకుపోతే తక్షణం ఆ ప్రాంతాన్ని సందర్శించి అందరినీ అప్రమత్తం చేశారు. కిలోమీటర్ల పాటు బురద మార్గంలోనే తన సహాయకుడు బైక్ ఎక్కి ప్రయాణించి అందరికీ షాక్ ఇచ్చారు. ప్రాజెక్టుకు పడిన గండిని స్వయంగా పరిశీలించే సాహసం చేశారు. నూజివీడులో పెద్దచెరువుకు గండి పడినప్పుడు స్థానికులను తరలించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించారు. పెదపాడు మండలంలో కృష్ణా కాల్వకు గండిపడినా, రామిలేరు దూసుకొచ్చినా, ఇంకోవైపు నుంచి బుడమేరు వరద చొచ్చుకొచ్చినప్పుడు తక్షణం కార్యరంగంలోకి దిగడమే కాకుండా పెద్ద సంఖ్యలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి కొత్త ధైర్యం ఇచ్చారు. కొల్లేరు ముంపు పెరుగుతుంటే వందలాది లంక గ్రామాలు ముప్పుకు చేరువగా ఉన్న పరిస్థితుల్లో ఉప్పుటేరు ముఖ ద్వారానికి చేరుకుని అక్కడ ప్రవాహానికి ఉన్న ఆటంకాలను ఎక్స్‌కవేటర్లతో తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఇలా గడిచిన పక్షం రోజుల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పాలనా వ్యవహారాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకవైపు సీఎం దగ్గర నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వరకు జిల్లాలో ఏం జరుగుతుందనే సమా చారాన్ని ఓవైపు అందిస్తూనే ఇంకోవైపు ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకుని శభాష్ అనిపించుకున్నారు.

క్షేత్రస్థాయిలోనే ఉండి..




సాధారణంగా విపత్తులు సంభవించినప్పుడు జిల్లా స్థాయిలో బాధ్యత వహిస్తున్న ఎస్పీ స్థాయి వంటి అధికారులు తనకింద స్థాయి అధికారులకు దిశ, నిర్దేశం చేస్తారు. యువ ఐపీఎస్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ జిల్లాలో ప్రజలకు ఆపద వచ్చినప్పుడు క్షణాల్లో వారి ముందు వాలిపోయారు. తన పరిధిలో ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ఆయా ప్రాంతాలకు క్షణాల్లో చేరేలా చేశారు. నూజివీడులో పెను విపత్తు సంభవించినప్పుడు ఈ రెండు రక్షక బృందాలతోపాటు ఎస్పీ అక్కడకు వెళ్లి స్థానికులను అందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా తెల్లవారుజాము వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరద సహాయ పనులను ముందస్తుగా పర్యవేక్షించేందుకు తన సతీమణి, జేసీ ధాత్రి రెడ్డితో కలిసి వెళ్లి మరీ పర్యవేక్షించారు. కొల్లేరులోను ముంపు పెరుగుతున్నప్పుడు కొల్లేరు పరిధిలోని అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో తాజా పరిస్థితిని సమీ క్షించి రాబోయే ముప్పు నుంచి జాగ్రత్తగా ఉండాలని ఆయా గ్రామాలను ముందస్తుగానే జాగ్రత్త పడేలా చేయడం ద్వారా అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. జిల్లాకు వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ తరహా చొరవ ప్రదర్శించిన ఐపీఎస్ అధికారుల్లో శివకిశోర్ ప్రథములు.

నేనున్నానంటూ భరోసా..



మరో ఐఏఎస్ యువ కెరటం జాయింట్ కలెక్టర్ కె.ధాత్రి రెడ్డి. ఆమె జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది గంటల వ్యవధిలోనే ముంపు ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో వరద రక్షణ బాధ్యతలను భుజానకెత్తుకున్నారు. గిరిజన గ్రామాలకు తానే స్వయంగా వెళ్లి. 'ముందు ప్రాణాలు కాపాడుకోవాలి, ఆ తర్వాతే ఏదైనా. మీ బాధ్యత మాది. మాతో సహకరించండి' అంటూ గిరిజన గ్రామాల ప్రజలను జేసీ ఒప్పించేలా చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానికులు చెప్పింది సావధానంగా వినడం, అనంతరం తాను చెప్పాల్సింది చెప్పి సహాయ చర్యలు కొనసాగేలా జాగ్రత్తలు పడ్డారు. ఇది ముంపు గ్రామాల ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. ఎక్కడికక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, అదికూడా ప్రజలను ఒప్పించి మెప్పించి ఫలితాలు సాధించడం విశేషం. ఇంకోవైపు సహాయ శిబిరాలున్న పెదపాడు, నూజివీడు, కుక్కునూరు, వేలేరుపాడు, కైకలూరు మండలాల్లో ప్రజలకు ఆహార పానీయాలు అందుతున్నది ఆరా తీయడమే కాకుండా ఇవన్నీ వారికి సక్రమంగా అందేలా తన దిగువస్థాయి అధికారులను పరుగులు పెట్టించారు.

మూడు జిల్లాలకు బాస్ అయినా ..




మూడు జిల్లాలకు అధిపతి అయినా, ఐజీగా ప్రమోట్ అయినా ఇవన్నీ పక్కనపెట్టి వరద నివారణ సహాయ చర్యల్లో అధికార బేషిజాన్ని పక్కనపెట్టి ఐజీ జీ.వి.జీ.అశోక్ కుమార్ ప్రత్యేకతను చాటుకున్నారు. జిల్లాలోని వరద ప్రాంతాల్లో ఆయన స్వయంగా పరిశీలనకు దిగారు. కైకలూరు-ఏలూరు మార్గంలో కొల్లేరు ఉప్పొంగుతుందన్న సమాచారంతో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారో స్వయంగా పరిశీలిం చేందుకు రోడ్డు మార్గాన్నే ఎస్పీతో కలిసి వెళ్లారు. సాధారణంగా ఈ స్థాయి అధికారు లంతా తన కింది స్థాయి అధికారులకు దేశాలు ఇచ్చి అమలయ్యేలా చూస్తారు. కాని అశోక్‌కుమార్ కార్యరంగంలోకి దిగడమే కాకుండా జోరున పడుతున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఏ చర్యలు తీసుకోవాలో దగ్గరుండి దిశ, నిర్దేశం చేశారు.

జిల్లా యంత్రాంగంలో ఆర్డీవోలు షేక్ ఖాజావలి, శివకుమారి, జిల్లా అధికారులు తూతిక శ్రీనివాస్‌తో సహా మిగతా అధికారులంతా ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొన్నారు. విజయవాడ నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందించడానికి వీరంతా నిద్రాహారాలు లేకుండా పనిచేశారు. దీంతో సామాన్యుల దగ్గర నుంచి దిగువ స్థాయి సిబ్బంది కూడా మా బాస్‌లు.. డైనమిక్ అంటూ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం.

ఈ -క్రాప్ బుకింగ్.. అన్నీ సమస్యలే!

- మొరాయిస్తున్న సర్వర్
- నమోదులో జాప్యం.. రైతుల ఆందోళన
- జిల్లాలో ఇప్పటివరకు 75.9 శాతం పూర్తి



ఏలూరు సిటీ, సెప్టెంబరు 9 : వ్యవసాయానికి సంబంధించి పంట పండించడంతో పాటు ధాన్యం కొనుగోలు, ఇతర ప్రయోజనాలు పొందడానికి రైతులు తప్పనిసరిగా ఈ -క్రాప్ నమోదు చేయించుకోవాలి. అయితే సవాలక్ష సమస్యలతో ఈ-క్రాప్ బుకింగ్ ఆలస్యం అవుతోందని, ప్రతిసారి సర్వర్ సమస్యలతో పాటు ఇతర సమస్యలతో ఈ-క్రాప్ బుకింగ్‌లో జాప్యం జరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటున్నారు. ఈ-క్రాప్ బుకింగ్‌ను సాగుచేసే అన్ని పంటలకు చేయించాల్సి ఉంది. అయితే కొన్ని సమస్యలతో ఈ -క్రాప్ బుకింగ్ ఆలస్యం అవుతోందని రైతులు చెబుతున్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల కూడా ఈ-క్రాప్ నమోదులో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లాలో ఖరీఫ్ పంటలకు సంబంధించి వరి, పత్తి పంటల సాగు జరుగుతోంది. మొత్తం 1,74,412ఎకరాలకు సంబంధించి ఇప్పటివరకు 1,32,373.3 ఎకరాల్లోని పంటలకు (75.9 శాతం) ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయ శాఖాధికారుల నివేదికలు చెబుతున్నాయి. ఖరీఫ్ వరి పంటకు సంబంధించి జిల్లాలో 1,69174 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటివరకు 1,30,567.9 ఎకరాలకు (77.2 శాతం) సంబంధించి ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. ప్రధానంగా టి.నరసాపురం మండలంలో అత్యధికంగా 98.9 శాతం, కుక్కునూరు మండలంలో అత్యల్పంగా 5.3 శాతం పూర్తయింది. మండలాల వారీగా ఉంగుటూరులో 58.2, చింతలపూడి 61.6, లింగపాలెం 63.4, పెదవేగిలో 66.5, ద్వారకా తిరుమల 66.8, కైకలూరు 78.2, కొయ్యలగూడెం 78.4, దెందులూరు 78.7, మండవల్లి 79.6, కలిదిండి 81.2, వేలేరుపాడు 88.2, ముదినేపల్లి 82.8, పెదపాడు 83.5, ముసునూరు 86.3, జంగారెడ్డిగూడెం 83.7, భీమడోలు 84.2, నూజివీడు 88.7, నిడమర్రు 85.6, చాట్రాయి 88.7, పోలవరం 88.8, ఏలూరు 89.7, టి.నరసాపురం 98.9, కామవరపుకోట 94.8, జీలుగుమిల్లి 97.5, ఆగిరిపల్లి 97.2, బుట్టాయిగూడెం 97శాతం ఈ -క్రాప్ బుకింగ్ నమోదు జరిగింది. పత్తి పంటకు సంబంధించి జిల్లాలో 5238 ఎకరాల్లో సాగు చేయగా ఇంతవరకు 1805.4 ఎకరాలకు సంబంధించి 34.47 శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయింది. జిల్లాలో అత్యధికంగా జంగారెడ్డిగూడెంలో 100.3 శాతం, అత్యల్పంగా కుక్కునూరు మండలంలో 12.3 శాతం ఈ-క్రాప్ బుకింగ్ నమోదైంది. సాగులేక పోవడంతో 11 మండలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ జరగలేదు. మిగిలిన మండలాల్లో పరిశీలిస్తే చింతలపూడి 85.9, లింగపాలెం 39.8, పెదవేగి 63.3, ద్వారకా తిరుమల 62.5, దెందులూరు 88.5, వేలేరుపాడు 74.5, ముసునూరు 36.6, జంగారెడ్డిగూడెం 100.3, నూజివీడు 42.7, చాట్రాయి 61.4, పోలవరం 79.1, కామవరపుకోట 96.7, జీలుగుమిల్లి 88.7, ఆగిరిపల్లి 87.3, బుట్టాయిగూడెం 98.5 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. ఈనెల 15వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉంది.

కారు నుంచి అకస్మాత్తుగా మంటలు..



భీమడోలు, సెప్టెంబరు 9 : కొవ్వూరు-గుండుగొలను నూతన జాతీయ రహ దారిపై సోమవారం రాత్రి 8 గంటల సమయంలో మంటల్లో చిక్కుకుని కారు దగ్ధమైంది. భీమడోలు మండలం పోలసానపల్లి సమీపంలో కారులో ఒక్క సారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. రాజమండ్రి నుంచి విజయ వాడ వెళ్తున్న ఈ కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. భీమడోలు ఎస్‌ఐ సుధా కర్ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేసి ట్రాఫిక్ నియంత్రించారు. ప్రయాణిస్తున్నవారు అప్రమత్తం అవడంతో పెను ప్రమాదం తప్పింది.



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభిస్తున్న వీసీ

అరటిలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 9: అరటిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడం ద్వారా లాభసాటి శిక్షణ అవసరమని ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద అరటినారు తీయుట, నారు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదురోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

పెదవేగి, సెప్టెంబరు 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి క్రీడాజట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 10వ తేదీ మంగళవారం జరగాల్సిన ఎంపిక పోటీలను వర్షం, వరదల కారణంగా వాయిదా వేశామని అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 6వ తేదీ శుక్రవారం నుంచి 21వ తేదీవరకు జరిగే స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం ఎంపిక పోటీలు పూర్తయ్యాయని, కాగా పదవ తేదీన జరగాల్సిన పోటీలను వరదల కారణంగా రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయనే ఆలోచనతో వాయిదా వేశామని, మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 21వ తేదీ సోమవారం వరకు యధాతథంగా జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే వాయిదాపడిన 4వ తేదీ పోటీలతో పాటు తాజాగా వాయిదా వేసిన 10వ తేదీన జరగాల్సిన పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపర్చుతామని జయరాజు తెలిపారు.

ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 11వ తేదీన జరగాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఎంపిక పోటీలు నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

గర్భ స్రావాలను తగ్గించాలి : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : జిల్లాలో సాధ్యమైనంత వరకు గర్భస్రావాలను తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు సూచించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఎంటీపీ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తల్లికిగానీ, బిడ్డకు గానీ ప్రమాదం ఉన్నదని తెలిసిన సందర్భాల్లో మాత్రమే చట్టంలో పేర్కొన్న నియమ నిబంధనలకు లోబడి మాత్రమే అబార్షన్లు నిర్వహించాలన్నారు. ఎక్విప్మెంట్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతీ నెల రిపోర్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి తప్పనిసరిగా పంపించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ ఇర్రింకి లక్ష్మి, డాక్టర్ చింతి ఆనంద్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుధాలక్ష్మి, డిప్యూటి డెమూ అనంతలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వీఎస్ ఆర్‌కె కుమారి తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు

జంగారెడ్డిగూడెంలో మేకల చోరీలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 9 : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోను వరుస మేకల చోరీలు జరుగుతున్నాయి. సెప్టెంబరు రెండో తేదీ సోమవారం అర్ధరాత్రి ఇందిరానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల వద్ద మటన్ వ్యాపారి షేక్ పీరు సాహెబ్ ఇంటి వద్ద మేకల దొడ్డిలో ఉన్న రూ.లక్షా ఇరవై వేలు విలువ చేసే ఆరు మేక పోతులను గుర్తుతెలియని నలుగురు దుండగులు తీసుకువెళ్లిపోయారురు. మేకల దొడ్డిలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరా ద్వారా దొంగతనం జరిగిందని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత రోజు బుధవారం మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన పంపన వెంకట్రావుకు చెందిన రూ.లక్షా ఇరవై వేల విలువ చేసే రెండు గొర్రె పోతులు, రెండు మేకపోతులు, మూడు మేకలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించుకుపోయారు. ఈయన కూడా జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దళారుల దోపిడీకి ఆక్వా రైతు బలి

- ఆరుగాలం కష్టం, పెట్టుబడి దోచుకుంటున్న వైనం
- కోట్లలో ఎగనామం
- రోడ్డున పడుతున్న ఆక్వా రైతు కుటుంబాలు



భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : ఆక్వా చెరువులు, రొయ్యలు, చేపలు ఎగుమతులు, కోట్లలో వ్యాపారానికి పెట్టింది పేరు పశ్చిమ గోదావరి జిల్లా. చాలా మంది రైతులు, వ్యాపారులు ఆక్వా వ్యాపారంపైనే ఆధారపడుతూ ఉంటారు. అలా రోజుకు వందల కోట్లు చేతులు మారుతూ ఉంటాయి. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని సంవత్సరాలుగా చేపలు, రొయ్యల రైతులు ఆరుగాలం కష్టపడి, లక్షల్లో పెట్టుబడులు పెట్టి చేపలు, రొయ్యలను పండిస్తే చివరకు కొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దళారులు మాత్రం కొంతకాలం తమకు డబ్బులు రాలేదని చెబుతూ తిరుగుతూ మళ్లీ యథావిధిగా బెంజ్ కార్లలో తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కువగా భీమవరం ప్రాంతంలో గత పది సంవత్సరాల కాలంలో పది వరకు జరిగాయంటే రైతులు ఏవిధంగా మోసపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

నగదు భేరానికి ధర తక్కువ

చేపలు, రొయ్యలు పండించిన సరుకును అమ్మకానికి దళారులతో ముందుగా మాట్లాడతారు. తాము ఫలానా కంపెనీకి సరుకు విక్రయిస్తామని వారు రైతులను నమ్మబలికిస్తారు. అలాగే కంపెనీలు ముందుగానే సొమ్ములు చెల్లించినా కూడా దళారులు మాత్రం క్యాష్ భేరం అయితే ధర తక్కువ, అరువు అయితే ధర ఎక్కువ చెబుతారు. దీంతో రైతులు ఆ సొమ్ములకు ఆశపడి అరువు భేరానికి సరుకును అమ్ముతారు. దీంతో దళారి ముందుగా క్యాష్ చేసుకుని రైతులను మాత్రం నట్టేట ముంచుతారు. ఇలాంటి తరహా మోసాలు చాలానే చోటు చేసుకున్నాయి. గత పదేళ్లలో భీమవరం చుట్టుప్రక్కల సుమారు రూ.500 కోట్లు వరకు రైతులు నష్టపోయినట్లుగా తెలుస్తుంది.



- సుమారు ఐదు సంవత్సరాల క్రితం భీమవరం పట్టణానికి చెందిన ఒక దళారి రైతులు వద్ద నుంచి రొయ్యల కొనుగోలు చేసి సొమ్ములు ఇవ్వకుండా తనకు పైనుంచి సొమ్ములు రావాలంటూ రూ.20 కోట్లు వరకు మోసం చేశాడు. ఒక సంవత్సరం అనంతరం ఆ దళారి డూప్లెక్స్ ఇంటిని నిర్మించుకుని సంతోషంగా ఉన్నాడు.
- కొంత కాలం క్రితం భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డుకి చెందిన ఒక రొయ్యల వ్యాపారి రూ.10 కోట్లు వరకు రైతులను మోసం చేశాడు. తను మాత్రం బెంజ్ కార్లలో తిరుగుతున్నాడు. రైతులను నట్టేట ముంచాడు.
- ఇటీవల భీమవరం రెండవ పట్టణానికి చెందిన ఒక రొయ్యల వ్యాపారి సుమారు రూ.35 కోట్లు వరకు రైతులకు ఎగనామం పెట్టాడు. ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఎవ్వరికి కనబడకుండా వెళ్ళిపోయాడు. రైతులు మాత్రం అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.
- భీమవరం రెండవ పట్టణానికి చెందిన ఒక వ్యాపారి సుమారు 10 రోజుల క్రితం ఏకంగా రూ.80 కోట్లు వరకు బకాయిలు పెట్టి ఐపి పెట్టినట్లుగా చెబుతున్నారు. రైతులు మాత్రం ఉన్న కొద్దిపాటి ఆస్తులను అమ్ముకుని అప్పులను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- భీమవరం ఒకటవ పట్టణానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు చేపల వ్యాపారి సుమారు రూ.12 కోట్లు వరకు రైతులకు బకాయిలు పెట్టాడు. గతంలో రూ.6 కోట్లు వరకు పెట్టడంతో ఒక ప్రజాప్రతినిధి అండతో ఎగ్గొట్టాడు. మళ్లీ ఇప్పుడు సుమారు రూ.6 కోట్లు వరకు బకాయిలు ఉండటంతో రైతులు ఇంటికి ఇటీవల వెళ్ళగా తనను కిడ్నాప్ చెయ్యడానికి వచ్చారు అంటూ పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఇలా దళారులు చేతుల్లో రైతులు మోసపోతూనే ఉన్నారు.



చంద్రబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న సింగపూర్ ప్రవాస తెలుగు వాసులతో ఎమ్మెల్యే ఆరిమిల్లి

వరద బాధితులకు ఎన్‌ఆర్‌ఐలు 17.50 లక్షల సాయం

తణుకు/ కొయ్యలగూడెం/ కామవరపుకోట సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం మానవీయతను చాటిన సింగపూర్‌లో ఉంటున్న ప్రవా సాంధ్రులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. సోమవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో సింగపూర్‌లో ఉంటున్న బొబ్బా రాజా చౌదరి, రాధిక ప్రసాద్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆరిమిల్లితో కలసి 17 లక్షల 50 వేల రూపాయలు చెక్కు అందజేశారు. ఎన్‌ఆర్‌ఐ పారేపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ విపత్కర తరుణంలో చంద్రబాబు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బాధితులకు తమవంతు సహకారం అందిస్తున్నానని చెప్పారు. సతీష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో వాషింగ్ మిషన్ల ఏర్పాటు

నూజివీడు టౌన్, సెప్టెం బరు 9: విద్యార్థుల సౌక ర్యార్థం నూజివీడు ట్రిపుల్ ఐటీలో హాస్టల్‌కు రెండు చొప్పున వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. హైయర్ స్మార్ట్ సొల్యూషన్స్ తరఫున ఈ వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేయగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ విద్యార్థులకు అందించారు. హైయర్ సంస్థ మేనేజర్ ఎన్.మనోజ్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థల్లో ఇప్పటి వరకు 3 వేల వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు వాటిని పేఅండ్ యూజ్ ద్వారా వాడుకోవాలని, దివ్యాంగులకు మాత్రం ఉచితం అన్నారు. ఏవో జి.లక్ష్మణరావు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బ్రహ్మస్వాములు, దుర్గా భవాని పాల్గొన్నారు.


గణనాయకా..నమోస్తుతే





పెనుమదం అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ మట్టి వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా మండపాల్లో కొలువు దీరిన గణనాథులు పూజలందుకుంటున్నారు. సోమవారం మూడో రోజు పలు ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు..



ద్వారకాతిరుమల కొప్పిశెట్టివారి వీధిలో నెలకొల్పిన భారీ గణపతి

ఒక్క క్షణం..ఆగండి





ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు
క్షణికావేశంలో నిర్ణయాలు
ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9: పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో అందరూ కలిసిమెలిసి ఆనందంగా జీవించేవారు. ఏ సమస్య వచ్చినా మేమున్నా మంటూ మిగిలిన కుటుంబ సభ్యులంతా భరోసా ఇచ్చే వారు. కాలం మారిపోయింది. మనిషి సుఖవంతమైన జీవితం కోసం వస్తువుల వెంటపడ్డాడు. ఉమ్మడి కుటుంబాల నుంచి బయటకు వెళ్లిపోయాడు. జీవితం యాంత్రికంగా మారిపోయింది. క్షణం తీరిక లేకుండా ఒత్తిడికి గురవుతున్నారు. సమస్య వస్తే చెప్పుకునే వారు లేకుండాపోయారు. క్షణికావేశంలోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒంటరి తనం, అనారోగ్యం, అప్పులబాధ, ప్రేమ విఫలం, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, కట్నం వేధింపులు వంటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా **సెప్టెంబరు 10న..ఆత్మహత్యల నివారణ దినోత్సవం** నిర్వహిస్తున్నది. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి 2003 నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

యువకులే ఎక్కువ

ఆత్మహత్యలు చేసుకునేవారిలో యువకులే ఎక్కువ మంది ఉంటున్నారు. అమ్మనాన్నాలతో ఆనందంగా గడిపి ఆ తరువాత హాస్టల్‌లో గడపాలంటే అక్కడ ఒంటరి తనానికి గురై ఒత్తిళ్ళకు లోనై చివరకు ఆత్మహత్యే శరణ్యమంటూ ప్రాణాలు తీసేసుకుంటున్నారు. ఆత్మహత్యలు చేసుకునే వారిలో పురుషులే ఎక్కువ మంది ఉంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ఆర్థికంగా ఇబ్బందులు పడ్డ వారు కొంతమంది కాగా స్థాయికి మించి అప్పులు చేసి తీర్చే మార్గం లేక సమాజంలో పరపతి పోతుందనే భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఎంత చదివినా విద్యలో రాణించలేక పోతున్నానని మనస్థాపానికి గురై ప్రాణాలు విడుస్తున్నారు..

సగటున నెలకు 53 మంది..

ఏలూరు జిల్లాలో వివిధ కారణాలతో ఏడాదికి 600 మందిపైబడి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వారి కుటుంబాలు తీరని విషాదానికి గురై చీకటిమయంలో జీవిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన రికార్డుల ప్రకారం 2020లో 661 మంది, 2021లో 682 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2022లో 678 మంది, 2023లో 639 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకూ 335 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. సగటున నెలకు 53 మంది తమ ప్రాణాలను బలవంతంగా విడిచిపెడుతున్నారు..

ఉన్నది ఒక్కటే జీవితం.. ఆనందంగా గడపాలి..



ఆత్మహత్య ఫలానావారే చేసుకుంటారని ఏమీ ఉండదు. పేదవాడి నుంచి ధనవంతుడి వరకూ చిన్నవారి నుంచి వృద్ధుల వరకూ ఏ క్షణమైనా ఈ ఆలోచన రావచ్చు. మానసికంగా వ్యథకు లోనైనవారు కుటుంబ సభ్యులతో సరిగా మాట్లాడకపోవడం, ప్రతిదానికి కోపగించుకోవడం, సరిగా భోజనం చేయకపోవడం, మతిమరుపు, నిద్రపోకపోవడం, ఒంటరిగా గడపాలని కోరుకోవడం, భయం భయంగా ఉండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి వాటిని గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులు ఆప్యాయతగా పలకరించడం, వారిపైన ప్రేమాభిమానాలు చూపించి అవసరాన్ని బట్టి మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలి.ఆత్మహత్య అనేది సెల్ఫ్ మర్డర్. మరో జీవితం ఉందో లేదో తెలియదు. ఉన్న జీవితంలోనే ఎదురయ్యే వడిదుడుకులకు భయపడకూడదు. ఆనందంగా జీవించాలి. ఏదైనా మానసికంగా ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, మానసిక వైద్య నిపుణులు, ప్రభుత్వాసుపత్రి ఏలూరు

క్రైం కార్నర్..



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ.. స్వాధీనం చేసుకున్న నగదు

ఏటీఎం సెంటర్లే టార్గెట్..
కార్డులు మార్చి సొమ్ము కొట్టేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9 : ఏటీఎం సెంటర్లకు వచ్చే అమాయకులను, చదువురాని వారిని ఆసరా చేసుకుని మోసగిస్తున్న ఒక వ్యక్తిని కైకలూరు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ చెప్పారు. ఏలూరులో సోమవారం వివరాలు వెల్లడించారు. కైకలూరు మండలం సింగాపురానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు కైక లూరులోని ఆగస్టు 5వ తేదీ ఉదయం ఏటీఎం సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసే సమయంలో అక్కడ ఒక వ్యక్తి ఉండి సహాయం చేసినట్లు నటించి ఆయన ఏటీఎం కార్డును మార్చివేశాడు. కార్డు ఉపయోగించి రూ. 46 వేలు అపహరించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తన సిబ్బందితో నిఘా పెట్టారు. కైకలూరు గంధీబొమ్మ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోనసీమ జిల్లా పోలవరంలోని దంగుడు బియ్యం వారి వీధికి చెందిన పల్లా సురేంద్ర కుమార్ అలియాస్ సురేంద్ర (32) అనే యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. కైకలూరులోనే మరో కేసులో 60,400 రూపాయలు అపహరించాడని, ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో రూ.20 వేలు ఒక మహిళ ఏటీఎం కార్డు ద్వారా తస్కరించాడని విచారణలో వెల్లడైంది. దీంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. సురేంద్ర కుమార్ చెడు వ్యసనాలకు బానిసై క్రికెట్ బెట్టింగులు, జల్సాలకు అలవాటుపడి ఇలాంటి నేరాలు చేస్తున్నాడన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకూ 60 పైగా కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కైకలూరు టౌన్‌లో నమోదైన రెండు కేసుల్లోనూ, ఏలూరు త్రిటౌన్‌లో నమోదైన కేసులలో మొత్తం 86,400 రూపాయల నగదు రికవరీ చేశామని వెల్లడించారు. డీఎస్పీతో పాటు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ, కైకలూరు టౌన్ ఎస్‌ఐ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు మృతి



పిల్లా విష్ణు (ఫైల్)

భీమడోలు, సెప్టెంబరు 9 : మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో పిల్లా విష్ణు (35) అనే వ్యక్తి మృతి చెందినట్టు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. భీమడోలు మండలం కురెళ్ళగూడెంలో ఉంటున్న పిల్లా విష్ణు పి.కన్నాపురం రైల్వే గేటు వద్ద వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి షాపు నుంచి ఇంటికి వస్తుండగా ఏలూరు వైపు నుంచి తాడేపల్లి గూడెం బత్తాయిపళ్ళ లోడుతో వెళ్తున్న ట్రక్కు విష్ణు మోటారు సైకిల్‌ను ఢీకొంది. అనంతరం ట్రక్కు బోల్తా పడింది. విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని స్వస్థలం ఉంగుటూరు కాగా వివాహం అయిన తరువాత కురెళ్ళగూడెంలో నివాసం ఉంటున్నారు. మృతుడికి ఒక పాప ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు మృతి
వైద్య సిబ్బందే కారణమంటూ ఆందోళన



రోదిస్తున్న బాలింత

టి.నరసాపురం, సెప్టెంబరు 9: మండలం లోని బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమ వారం ఒక పసికందు మృతిచెందింది. బొర్రం పాలెం గ్రామానికి చెందిన బాధిత మహిళ రేఖ తెలిపిన వివరాల ప్రకారం పురిటి నొప్పులు రావడంతో ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు డెలి వరీకి సమయం పడుతుందని జాప్యం చేస్తూ వచ్చారని సోమవారం సాయంత్రం నాలుగు తర్వాత పురుడు వచ్చిందన్నారు. ఆ తర్వాత తన బిడ్డను జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారని అప్పటికే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రికి చేరుకుని బిడ్డ మృతికి కారణం వైద్య సిబ్బందే అని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యవైఖరి వల్ల బిడ్డ మృతి చెందిందని ఆందోళనకు దిగారు.ఈ విషయమై వైద్యురాలు ఇమాంబీని ప్రశ్నించగా బిడ్డకు తల్లి కడుపులో పేగు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఏఎస్‌ఐ జయకుమార్ వైద్య సిబ్బంది, బాధితులతో చర్చించి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఫోన్ చూడవద్దన్నందుకు యువతి ఆత్మహత్య

కుక్కునూరు, సెప్టెంబర్లు 9: మండల పరిధిలోని గణపవరంలో జామాయిల్ నర్సరీలో పనిచేస్తున్న కొవ్వాసి పైకే (18) అనే యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన యువతి తన అన్న, బంధువులతో కలిసి వారం రోజు క్రితం నర్సరీలోకి పనికి వచ్చింది. ఫోన్ ఎక్కువగా చూస్తూ పని సరిగా చేయకపోవడంతో అన్న మందలించి ఆమె నుంచి ఫోన్ తీసుకున్నాడు. దీంతో మనస్థాపానికి చెందిన కొవ్వాసి పైకే చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యా వియోగం..ఆత్మహత్య

నరసాపురం, సెప్టెంబరు 9 : నరసాపురం కొత్తకాలనీలో ఈ నెల 7న బ్లెడ్‌తో పీక కోసుకొని ఆత్మహత్యాయ్నానికి ప్రయత్నించిన కె.చిన్న సోమవారం చికిత్స పొందుతూ విజయవాడలో మృతి చెందిన్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. గొడవలు కారణంగా కొంతకాలంగా చిన్న భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : తాళం వేసిన ఇంట్లో చొరబడి తాళాలు బద్దలు కొట్టి బంగారం, వెండి, నగదు దోచుకెళ్ళిన సంఘటన భీమవరంలో చోటు చేసుకుంది. ఆదర్శ్ నగర్‌లో నివాసం ఉండే దండు రంగరాజు ఈనెల 4వ తేదీన బెంగళూరు తన కుమార్తె వద్దకు వెళ్ళాడు. ఈ నెల 8వ తేదీన తన పక్క నివాసం ఉండే వ్యక్తి ఫోన్ చేసి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయని చెప్పడంతో వచ్చి చూసుకునేసరికి 20 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 50 వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

రైతులను ఆదుకుంటాం

» ఎమ్మెల్యేలు పత్సమట్ల, చింతమనేని » కొల్లేరు ముంపు గ్రామాల్లో పర్యటన



నిడమర్రు మండలంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు సెప్టెంబర్ 9 : వరద వల్ల దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్నిరకా లుగా ఆదుకొంటుందని రైతులకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. ఛానమిల్లి పెద్దింట్మ గుడి ప్రాంతంలో గల కొల్లేరు వరద ముంపున కు వరి చేలను సోమవారం ఆయన సందర్శించి రైతులను పరామర్శించారు. అనం తరం వరదముంపు చేలల్లోకి రాకుండా రైతులు చేపట్టిన తాత్కాలిక చర్యలను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవో ఎస్. గీతాదేవి, ఎంపీడీవో జి.విజయకుమారి, తహసీల్దార్ నాగరాజు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు : మల్లవరంలో కొల్లేరు నుంచి వరద నీరు పొంగుతున్నట్లుగా వస్తున్న సూచనల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. గ్రామంలో ఆయన పర్యటించారు. నల్లకోడు వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● పెదపాడు : వరద ముంపు వల్ల ఇబ్బంది పడుతున్న పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లోని ప్రజలను, పాడి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వరద ముంపు వల్ల ఆవులు, గేదెలకు పచ్చ, ఎండు గడ్డి కరువైందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తరఫున సిద్ధం చేసిన 200 టన్నుల టీఎంఆర్‌ను గోగుంటలో ఎమ్మెల్యే పాడిరైతులకు సోమవారం అందజేశారు. కూటమి నాయకులు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ నెహ్రూబాబు, డీడీ వైద్యులు గోవిందరాజు, మోహన్‌బాబు, సంధ్యావాణి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు ఏలూరు రూరల్ మండ లం పాలగూడెం,జాలిపూడి, కాట్లంపూడి, కోటేశ్వరదుర్గాపురం, చాటపర్రు, కోణంగి ప్రాంతాల్లో నీరు చేరి పంటలు నీటిలో తేలియాడుతున్నాయి. ఎక్కువ రోజులు నీరు ఉంటే భారీగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్టేరు నుంచి సోమవారం వచ్చిన శాస్త్రవేత్తలు టి.సునీత, రోజ, భువనేశ్వరి తదితరులు జాలిపూడిలో నీటమునిగిన పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంటలను కాపాడుకోవడానికి సలహాలు, సూచనలు అందచేశారు. వారివెంట ఏలూరు మండల వ్యవసాయశాఖ అధికారిణి జీవనసంధ్య, రామ్‌తేజ, సూరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : భారీ వర్షాలకు అంతంత మాత్రంగా ఉన్న రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. డ్రెనేజి సౌకర్యాలు లేకపోవడంతో రోడ్ల మీదే వర్షపునీరు భారీ స్థాయిలో ప్రవహించడంతో ప్రజల ఇబ్బందులను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ తెలుసుకున్నారు. ఈ మేరకు ఉప్పలపాడు, ఆడమిల్లి గుంటుపల్లి తదితర గ్రామాల్లో వరద నీటి ప్రవాహ ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. నివేదికను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, సీఎం చంద్రబాబు, కలెక్టర్‌కు తెలియచేశారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి, ఖాన్ వజీర్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద

చింతలపూడి, సెప్టెంబరు 9: చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు కొనసాగుతోంది. రెండు రోజులుగా పడిన వర్షాల వల్ల పరివాహక ప్రాంతాల్లోని నీరు కూడా చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం 347.49 అడుగులకు చేరింది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో 3350 క్యూసెక్కుల నీరు వస్తోంది. దిగువకు 4,773 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు

జంగారెడ్డిగూడెం : ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు పోటెత్తుతుంది. సోమవారం ఉదయం గంటకు 3,915 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుకోగా 3,915 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటి మట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.06 మీటర్లు గా ఉంది.

పాఠశాల పరిసరాలు పరిశీలించిన డీఈవో

భీమడోలు, సెప్టెంబర్ 9 : ఇటీవల పూళ్ళ హైస్కూలులో చదువుతున్న పేదాడ మీనాక్షి అనే పదో తరగతి విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన తెలిసిందే. అయితే ఆ విద్యార్థిని డెంగీతో మృతి చెందినట్లుగా వచ్చిన వార్తల నేపథ్యంలో పాఠశాలలో పరిసరాలను డీఈవో ఎస్.అబ్రహాం సోమవారం పరిశీలించారు. విద్యార్థిని వివిధ అనారోగ్య సమస్యలు కారణంగా మృతి చెందిందని డెంగీ జ్వరం కాదని వివరణ ఇచ్చారు. ఎంఈవోలు భాస్కర్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫైర్ ప్రేయర్ టీం నూతన కమిటీ ఎన్నిక

టి.నరసాపురం, సెప్టెంబరు 9: మర్రిగూడెంలోని షాలేము గాస్పెల్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు కె.నిరీక్షణరావు అధ్యక్షతన స్థానిక చర్చిలో సోమవారం ఫైర్ ప్రేయర్ టీం 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పాస్టర్ జి.జ్ఞాన్‌రాజు, గౌరవాధ్యక్షుడిగా పాస్టర్లు, సీహెచ్ హోషేయ, నిరీక్షణరావు, కార్యదర్శి వై.పాల్ చిన్నారావు, కోశాధికారి సీహెచ్ రమేష్ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఎస్‌సీసీ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు రెవరెండ్ ఎం.కరుణాకర్, పాస్టర్లు ప్రసన్న, టి.అకుల, దదాను, జాన్, మీకా, ప్రసాద్, జోయల్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 9: టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ మొగతడకల శ్రీనివాసరావు (ఎంఎస్ఆర్) గ్రామంలోని సుమారు 500 మంది నిరుపేదలకు సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. తన భార్య, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు లక్ష్మీరమణితో కలసి తన పుట్టిన రోజు పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంచారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. ఎం.సంజయ్‌చౌదరి, ఓంప్రకాష్‌చౌదరి, పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకచవితి వేడుకల్లో ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 9: నియోజకవర్గంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవతంగా నిర్వహించటం సంతోషదాయకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. విజయ్‌విహార్ సెంటర్, రామలక్ష్మణ్ జిమ్, నాని ఫ్రూట్స్ ఏరియా, కూరగాయల మార్కెట్, కుండీసెంటర్, శ్రీజాలా పహరేశ్వరస్వామి కూరగాయాల వర్తక సంఘం ఆధ్వర్యంలో, సంతమార్కెట్ వద్ద కొలువుదీరిన భారీ గణపయ్య విగ్రహాలను చంటి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్థసారథి, నాయుడు సోము, కె.రామ్మోహనరావు, మారం హనుమంతరావు, చోడే వెంకటరత్నం, కోలా భాస్కరరావు, బీ.వాసు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక దృష్టి

టి.నరసాపురం, సెప్టెంబరు 9: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జీలుగుమిల్లి సీఐ బీవీ రావుతో కలిసి సోమవారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. గణేష్ మండపాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్సై జయబాబు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

మహిళా పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్‌గా సుబ్బారావు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 9 : జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ఎం.సుబ్బారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన సుబ్బారావు ఏలూరు రేంజ్‌లోని గన్నవరం, విజయవాడలోని పలు ప్రాంతాలు, నర్సాపురం, పాలకొల్లు, చాగల్లు, మొగల్తూరు, ఏలూరు త్రీ టౌన్‌లలో ఎస్ఐగా పనిచేశారు. సీఐగా పదోన్నతి పొందిన తరువాత కొవ్వూరు రూరల్, నర్సాపురం, భీమడోలు సర్కిళ్ళల్లో ఇనస్పెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం డీసీఆర్బీ ఇనస్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆయన సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

బాలికల వసతి గృహంలో పారిశుధ్యం అధ్వానం

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 9 : బాలికల వసతి గృహంలో పారిశుధ్యం, మురుగు నీరు అస్తవ్యస్తం గా ఉందని ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థి నులు అనారోగ్యానికి గురవుతారంటూ హాస్టల్ అధికారులను జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు అమీనాపేటలో ఉన్న బీసీ బాలికల సంక్షేమ వస తి గృహాన్ని జడ్జి రత్న ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి అసహనం వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జడ్జితో పాటు ప్యానల్ లాయర్లు గంగాభవానీ, సునీతలు ఉన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ఉంగుటూరు, సెప్టెంబరు 9 : విజయవాడ వరద బాధితులకు నారాయణపురం సమతా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకుల తరఫున వేగేశ్న సత్యనారాయణరాజు అధ్యక్షతన సోమవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఉంగుటూరుకు చెందిన కొండ్రెడ్డి చిట్టిబాబు కుమార్తె శేష శైలు(ఎన్నారై)తరఫున రూ.80 వేలు రామచంద్రాపురం గ్రామానికి చెందిన గౌతు రామచంద్రరావు రూ.10 వేలు, చేబ్రోలు వెల్ఫేర్ సొసైటీ తరఫున రూ.37,367లను విరాళంగా అందించారు.

● ద్వారకాతిరుమల : వరద బాధితుల సహాయ నిధికి జి.కొత్తపల్లికి చెందిన టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం సేకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు రూ.50 వేలు, వ్యాపారవేత్త నార్ల కాశీనాథం మరో రూ.50 వేలు తన కుమారుడు నార్ల రాజేంద్ర నాథ్ ద్వారా సీఎం సహాయ నిధికి పంపాలని పార్టీ నేతలు లంకా సత్యనారాయణ రావు, పోలిన శ్రీనివాసరావు, నాదెళ్ల సురేంద్ర నాథ్ చౌదరికి అందజేశారు.

గణపతి లడ్డూ వేలం

ఉంగుటూరు, సెప్టెంబరు 9 : దొంతవరం గ్రామ శ్రీవర సిద్ధి వినాయక స్వామి లడ్డూ వేలంను సోమవారం నిర్వహించగా సర్పంచ్ కె.సూరిబాబు,సత్యవతి దంపతులు రూ.51 వేలకు దక్కించుకున్నారు. ఎ.పెద్దిరాజు, పి.మహంకాళిరావు, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రామకుమార్ పుట్టిన రోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 9:టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక సూర్యకిరణ్ కళ్యాణ మండపంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమక్షంలో రామకుమార్ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 9: వరద బాధితులకు సహాయం చేయడానికి నగర పారిశుధ్య కార్మికులను విజయవాడ పంపించామని, ప్రజలు తమ ఇళ్లల్లో ని చెత్తను రోడ్ల పై పడవేయకుండా జాగ్రత్త వహించాలని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ సూచించారు. వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీ రోజు తినే ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద బాధితులకు ఆహార పదార్థాలు వండించి పంపించటంలో, విజయవాడ నగరాన్ని శుభ్రం చేయడానికి సిబ్బంది వెళ్లడం వలన పారిశుధ్య పనులకు కొంచెం ఆటంకం కలుగుతుందన్నారు. ప్రజలు పెద్ద మనస్సుతో సహకరించాలని కోరారు.

కొల్లేరు ముంపు బాధితులను ఆదుకోవాలి



మాదవాయిపాలెం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు రూరల్ : ముంపునకు గురైన ఏలూరు రూరల్ గ్రామాల్లోని కొల్లేరు, లంక గ్రామ ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని కోరారు. కొల్లేరు లంక గ్రామం మాదవరంలో సోమవారం పర్యటించి ఆక్వా రైతులు, ప్రజలతో మాట్లాడారు. కొల్లేరు సరస్సులకు వరద నీరు ప్రవేశించటం వల్ల కొల్లేరును ఆనుకుని ఉన్న మాదవరం, మొండికోడు, కోమటిలంక, యాగన మిల్లి, గుడివాకలంక, పత్తికోళ్ళ లంక గ్రామాల్లో వరద నీరు చేరడంతో ప్రజలు నీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏలూరు నుంచి చాటపర్రు మీదుగా లంక గ్రామాలకు వెళ్ళేదారులు జలమయం అయ్యాయన్నారు. ఆక్వా రైతులు ట్రాక్టర్లపై ప్రమాదకర స్థితిలో ప్రయాణించాల్సి వస్తోందని, ఆక్వా రైతులు చెరువుల వద్దకు వెళ్లటానికి ప్రజల రాకపోకలకు బోట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

● పెదపాడు : వరద ప్రాంత రైతులను, ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. గోగుంట, వసంత వాడ వరద ప్రాంతాల్లో సీపీఎం నాయకుల బృందం సోమవారం పర్యటించి ముంపునకు గురైన ఇళ్లను, పంటలను పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ బుడమేరు వరద ఫలితంగా ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, పంట నష్టం అంచనా వేసి పూర్తిస్థాయి పరిహారం అందజేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, కిషోర్, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేయండి : జేసీ ఆదేశం

పెదపాడు, సెప్టెంబరు 9 : వరదలు, భారీ వర్షాలు ప్రభావంతో నమోదు చేస్తున్న పంట నష్ట అంచనాల వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలో ముంపునకు గురైన సత్యవోలు, నాయుడుగూడెం గ్రామాల్లో పంటలను సోమవారం పరిశీలించారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నష్టం వివరాలను మంగళవారం సాయంత్రం ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పంట నష్టం నమోదు ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

పెదవేగి, సెప్టెంబరు 9 : నాగిరెడ్డిగూడెం ఎగువన కురుస్తున్న వర్షాలతో తమ్మిలేరు నుంచి భారీ వరద వస్తున్న కారణంగా తమ్మిలేరు పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పెదవేగి మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ సూచించారు. కార్యదర్శులు, వీఆర్వోలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అలాగే గణేష్ నిమజ్జనాల సమయంలో కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శులు ప్రసాద్, విజయ్, సలోమీ, సౌజన్య, ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉపాధ్యాయుల సాయం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 9 : వరద బాధితులకు ఉపాధ్యాయులు అందజేసిన నగదు, వస్త్ర, దుస్తులు, పండ్లు, బిస్కెట్లతో సోమవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి జిల్లాలోని పెదపాడు, గోగుంటలలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. పెదపాడు మండలం వసంతవాడలో బాధితులకు దుస్తులు, పాల ప్యాకెట్లు, దుప్పట్లు, యాపిల్స్‌ను పంపిణీ చేశామని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికు మార్ తెలిపారు. అనంతరం విజయవాడ అజిత్‌నగర్, వాంబేకాలనీ, పాయకాపురంలలో సాయం అందజేశామన్నారు. సంఘ నాయకులు సుభాషిణి, రంగమోహన్, కమల్‌కుమార్, మోహన్‌రావు, రమణ, ప్రసాద్, లక్షణరావు, అపర్ణకుమారి, సుధ, బాలబాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9:ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామాన్ని సోమవారం ఆర్డీవో ఎస్.ఎస్‌కె ఖాజావలీ సందర్శించారు. వరద బాధితులకు బియ్యం, పంచదార, వంట నూనె, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళ దుంపలు పంపిణీ చేశారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేయడంతో పాటు బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాధితులకు సహాయ చర్యలు నిర్వహిస్తున్నామని, ఏలూరు డివిజన్‌లో ఏడు పునరావాస కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 9 : మండలంలోని పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద సోమవారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వరదలు వచ్చిన ప్రతీసారి జల్లేరు వాగు పొంగి జంగారె డ్డిగూడెం నుంచి ఏజెన్సీకి రాకపోకలు నిలిచి పోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజన ప్రాంత ప్రజలతో ధర్నా నిర్వహిస్తా మని హెచ్చరించారు నాయకులు జి.సూ ర్యకిరణ్, జి. సూర్య చంద్రరావు, ఐ.ప్రభాకర రావు పాల్గొన్నారు.

జల్లేరు కొండ వాగుపై వంతెన నిర్మించాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 9 : రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు కొండవాగుపై వంతెన నిర్మించాలని గిరిజనులు సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జల్లేరు వాగు వద్ద సోమవారం ఆందోళన చేశారు. మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ రెడ్డిగణపవరం-రామారావుపేట మధ్య జల్లేరు కొండవాగుపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఇదే కల్వర్టుపై రాకపోకలు సాగించే అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.జలపాలు, పి.దుర్గారావు, కె.శ్రీరాములు, కె.వెంక టేశ్వరావు, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 9 : జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచనలతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు తహసీల్దార్ అర్బన్ శేషగిరి, ఏలూరు మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ ఇతర శాఖల అధికారులు వినాయక నిమజ్జనాలపై జాగ్రత్తలు తీసుకునేందుకు ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఏలూరు కృష్ణా కాలువ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిమజ్జనం చేసే ప్రాంతాల వద్ద మెడికల్ క్యాంపులు, గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, ప్రత్యేక అధికారి అయిన శ్రీనివాసరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతీ, ఆర్ఐ నాయక్, మున్సిపల్ డీఈ కొండలరావు, మున్సిపల్ ఈఈ శేషగిరి, వన్ టైన్, టూ టౌన్, త్రీ టౌన్ ఎస్ఐలు మదీనా బాషా, నాగ కల్యాణి, రాంబాబు పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్ : నగరంలో వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబులు పేర్కొన్నారు. కృష్ణకాల్వ వెంబడి తూర్పులాకుల వద్ద, మినీ బైపాస్ రోడ్డు గ్రీన్‌సిటి ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశామన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఎర్రకాలువ జలాశయం వద్ద వినాయక నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పలువురు అధికారులతో కలిసి ఆర్డీఓ కె.అద్దయ్య పరిశీలించారు. గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచామన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎం.ముక్కంటి, డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దారు కె.స్లీవజోజి. డిపూటీ తహసీల్దారు కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : వినాయక విగ్రహాల నిమజ్జనంపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఆలయ కమిటీలకు ముందస్తూగా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించి చర్చించారు. ప్రత్యేకాధికారి బాబ్జీ, తహసీల్దార్ చలపతిరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నవారికి సాయపడడమే మానవత్వం





చెక్కులు అందజేస్తున్న కొయ్యలగూడెంలోఎమ్మెల్యే బాలరాజు, ఏలూరులో ఎమ్మెల్యేలు, బడేటి, చింతమనేని, రెడ్డిఅప్పలనాయుడు తదితరులు

పంచాయతీలకు రూ.లక్ష అందజేత

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9: వరదలతో అతలాకుతలమైన సమయంలో బాధితులకు, కష్టాల్లో ఉన్న వారికి సహాయపడటమే అసలైన మానవత్వమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వరద బారిన పడిన పంచాయతీలకు ప్రకటించిన రూ.లక్ష విరాళాన్ని ఏలూరు జిల్లాపరిషత్ కార్యాలయంలో జనసేన, ఉమ్మడి పశ్చిమజిల్లా అధికార ప్రతినిధి రెడ్డిఅప్పలనాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వరద బాధిత గ్రామ సర్పంచ్‌లకు చెక్కుల రూపంలో అందచేశారు. ముఖ్య అతిథిలు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, పి.ధర్మరాజు, మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ హాజరై వారి చేతులమీదుగా సర్పంచ్‌లకు చెక్కులు పంపిణీ చేశారు. డీపీవో టి.శ్రీనివాస్, జడ్పీ సీఈవో సుబ్బారావు, జనసేన నాయకులు ఎన్.శేషు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం కొయ్యలగూడెంలో నియోజకవర్గంలోని 31 పంచాయతీలకు పవన్‌కల్యాణ్ అందజేసిన నిధులను ఒక్కొక్క పంచాయతీకి రూ.లక్షల చెక్కును అందజేశారు. పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జనసేన నాయకులు కరాటం సాయిబాబు, రవి, దుగ్గిన శ్రీను, మాదేపల్లి శ్రీను, ఏడు మండలాల ముఖ్య నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : మండలంలోని కోయిద, కటుకూరు, నాళ్ళవరం, తిరుమలాపురం, తాటుకూరుగొమ్ము, చేపాకగొమ్ము, రుద్రమ్మకోట పంచాయతీలకు రూ.లక్ష చొప్పున కొయ్యలగూడెంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పంపిణీ చేశారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం మరో రూ.20కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని ఈ నిధులతో అన్ని గ్రామ పంచాయతీలకు అభివృద్ధి చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, కె.క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : కుక్కునూరు, దాచారం, గొమ్ముగూడెం, ఉప్పేరు, దామరచర్ల, సీతారామనగరం పంచాయతీలకు పోలవరం ఎమ్మెల్యే బాలరాజు చేతులు మీదుగా రూ.ఆరు లక్షలు సిబ్బందికి అందజేశారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగందర్, మంత్రి గోపాలకృష్ణ, కోటి పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఎ.పోలవరం, చక్రదేవరపల్లి, దేవులపల్లి, లక్కవరం, నాగులగూడెం, పంగిడిగూడెం, వేగవరం, పట్టెన్నపాలెం, తాడువాయి, తిరుమలాపురం పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు చింతలపూడి నియోజక వర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన రూ.లక్షల చెక్కులను పంపిణీ చేశారు. మాజీ డీసీసీబీ చైర్మెన్ కరాటం రాంబాబు,ఈఓఆర్డీ నాగిరెడ్డి, కూటమి నేతలు కరాటం సాయి,గడ్డమణుగు రవికుమార్, జి.ఉమా,రావూరి కృష్ణసాయిల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం :మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, బంధంచర్ల పంచాయతీలకు రూ.లక్షల చెక్కులను సర్పంచ్‌లకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అందజేసినట్లు జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు తెలిపారు. మండలపార్టీ అధ్యక్షులు అడపా నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షులు మాలెంపాటి హరిబాబు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

జంగారెడ్డిగూడెం, భీమడోలు సీఐలుగా...

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 9 : జంగారెడ్డిగూడెం సీఐగా వి.కృష్ణబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు స్టేషన్‌లలో ఎస్సై గా పని చేశారు. చివరిగా గవర్నర్‌పేటలోని చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి సీఐగా పదోన్నతిపై జంగారెడ్డిగూడెం మొదటి పోస్టింగ్‌లో చేరినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్సై ఎస్‌కే జబీర్, తడికలపూడి ఎస్సై చిన్నారావు, ట్రాఫిక్ ఎస్సై రాంబాబు, పోలీసు సిబ్బంది కృష్ణబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

● భీమడోలు : భీమడోలు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా యూజే విల్సన్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు విజిలెన్స్ సీఐగా పనిచేసిన ఆయన భీమడోలు సీఐగా చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

తగ్గుతున్న వరద

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 9 : వర్షం సోమవారం మధ్యాహ్నం నుంచి తగ్గిపోవడంతో తమ్మిలేరు కాలువ ప్రవాహం తగ్గింది. అయితే చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలో ఉన్న తమ్మిలేరు జలాశయానికి 4500 క్యూసెక్కుల నీరు వచ్చి జలాశయంలో చేరుతుండడంతో ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం నుంచి 4,700 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు కాలువ నుంచి ఈ ప్రవాహం వెళ్తూ ఏలూరు సమీపంలోని చొదిమెళ్ళ ఎఫ్‌సీఐ గోడౌన్స్ ఎదురుగా రెండు పాయలుగా చీలిపోతు ంది. మళ్ళీ ఆ రెండు పాయలు తిరిగి కొల్లేరులోనే కలుస్తున్నాయి. శనివారపు పేట మీదుగా వెళ్ళే తమ్మిలేరు కాలువ ఏలూరు - శనివారపుపేట కాజ్‌వేపైకి 8వ తేదీ సాయంత్రం నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలను నిలిపి వేశారు. అయితే సోమవారం సాయంత్రానికి నీరు తగ్గింది. మరో వైపు ఏలూ రు ఆర్డీవో ఎస్ఎస్‌కె ఖాజావలి ఆ ప్రాంతానికి చేరుకుని ఎప్పటికప్పు డు ఆ పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు.

ఓ బొజ్జ గణపయ్యా..





నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో, భీమడోలు రైల్వే గేటు సమీపంలో గణనాథులు





పవరుపేటలో మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు, కర్రివారి వీధిలో చిన్నారుల పూజలు

ఘనంగా నిమజ్జనాలు

పెదవేగి, సెప్టెంబరు 9 : గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వినాయకచవితి వేడుకల్లో భాగంగా మూడోరోజు సోమవారం గణపతి నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదవేగి, లక్ష్మీపురం, వేగివాడ, ముండూరు తదితర గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనాలు చేశారు. తీన్‌మార్ వాయిద్యాల నడుమ, గణపతి బప్పా మోరియా అంటూ భక్తజనం గణపతి నామంతో వెంట రాగా గణనాధుడ్ని గ్రామాల్లో ఊరేగిస్తూ సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

● చింతలపూడి : వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా మూడోరోజు నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. నగర పంచాయతీలోని మారుతీనగర్‌లో ఏర్పాటుచేసిన చవితి పందిరిలో వినాయకుడి విగ్రహానికి ఉదయం పూజలు జరిపి, గ్రామంలో ఊరేగించారు. అనంతరం తమ్మిలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.



లక్ష్మీపురంలో ఊరేగుతున్న గణనాథుడు



చింతలపూడిలో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

ప్రాణాంతక వ్యాధి ఉందని.. వేధింపులు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 9 : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తిని అతని భార్య, కుమారుడు మానసికంగా, శారీరకంగా వేధిస్తూ చాకుతో దాడి చేయడంతో బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతని భార్య, కుమారిడిపై కేసు నమోదు చేశారు. ఏలూరులోని తంగెళ్ళమూడి ప్రాంతం ఎంఆర్‌సీ కాలనీకి చెందిన ఒక వ్యక్తి (48) ప్రాణాంతక వ్యాధితో బాధపడుతు న్నాడు. ఆ వ్యాధి ఉందని తెలిసిన మరుక్షణం నుంచి భార్య కుమారుడు అతనిని మానసికంగా, శారీరకంగా వేధిస్తూ అంటరాని వాడిగా చూస్తు న్నారు. తమ ఇంట్లో నుంచి వెళ్ళిపోవాలంటూ వేధించి చాకుతో దాడి చే యడంతో చేతిమీద చాకు గీసుకుంది. దీంతో బాధితుడు ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతని భార్య, కుమా రుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

టి.నరసాపురం, సెప్టెంబరు 9: లంకాలపల్లిలో పేకాట ఆడుతున్న సమాచారంతో ఏఎస్సై వి.జయకుమార్ తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసిన ట్లు ఎస్సై తెలిపారు. మరో పేకాట శిబిరంపై హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తన సిబ్బందితో దాడిచేసి ఎనిమిది మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.1,550 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.



ఊటుకూరులో ముంపులో పొలాలు.. కుళ్లిన వరి పైరు చూపుతున్న రైతు



బొమ్మినంపాడులో చేపల చెరువుకు గండ్లు



ముసునూరు మండలంలో కోతకు గురైన వలసపల్లి రహదారి

కుళ్లుతున్న వరి.. చేపల చెర్వులకు గండ్లు

నీట మునిగిన వరి, ఆక్వా చెర్వులకు గండ్లతో రైతుల విలవిల

ముదినేపల్లి, సెప్టెంబరు 9 : వారం రోజులుగా ముదినేపల్లి ప్రాంతంలో ముంపులో ఉన్న వరి పైరు కుళ్లిపోతున్నది. భారీ వర్షాలు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పొలాలు నుంచి ముంపు నీరు బయటికిపోయే మార్గం కనిపించటం లేదు. ముదినేపల్లి మండలంలోని పోల్‌రాజ్, పెదలంక, పెదకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్ల పరిధిలో వేలాది ఎకరాల ఆయకట్టులోని వెదజల్లిన, నాట్లు వేసిన వరి పైరు కుళ్లిపోయింది. వేలాది ఎకరాల్లోని వరి చేతికి దక్కే అవకాశం కనిపించటం లేదు. డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటు కాడ తొలగింపు పనులు సకాలంలో జరగకపోవటంతో ముంపు ఎక్కువైంది. ఊటుకూరు మీడియం డ్రెయిన్ దిగువ భాగంలో 4 కిలోమీటర్ల మేర పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటుకాడ, కిక్కిస తొలగింపు పనులు చేపట్టకపోవటంతో డ్రెయిన్‌లో నీటి ప్రవాహం స్తంభించిపోయింది. దీంతో ఊటుకూరు ఏరియాలో ఈ డ్రెయిన్ కింద వందలాది ఎకరాల భూముల్లో ముంపు తగ్గక వరి పైరు కుళ్లిపోయింది.

ఆక్వా రైతులకు భారీ నష్టం

భారీ వర్షాలు చేపల చెరువులకు తీవ్ర నష్టం కలిగించాయి. పలు ప్రాంతాల్లోని చేపల చెరువుల గట్లకు గండ్లు పడే పరిస్థితి ఏర్పడింది. ముదినేపల్లి మండలంలోని చేపలు, రొయ్యలు చెరువుల గట్లు వర్షాల వల్ల వారం రోజులుగా ముంపు తాకిడికి తట్టుకోలేక బలహీన పడుతున్నాయి. ఇసుక నేలల్లో తవ్విన చెరువులకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. మండలంలోని బొమ్మినంపాడు గ్రామ పరిధిలోని చేపల చెరువులకు సోమవారం గండ్లు పడ్డాయి. చెరువుల గట్లను పటిష్టం చేసేందుకు ఆక్వా రైతులు నానా తంటాలు పడుతున్నారు. పక్క చెరువుల్లోకి చేపలు కొట్టుకుపోకుండా ఇసుక సంచులను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామానికి చెందిన బాసినశెట్టి కిషోర్ అనే రైతు చేపల చెరువు గట్లుకు పెద్ద గండ్లు పడి టన్నుల కొద్ది చేపలు పక్క చెరువుల్లోకి, పొలాల్లోకి కొట్టుకుపోయాయి. ఆ రైతుకు చెందిన నాలుగెకరాల చేపల చెరువు గట్టుకు గండ్లు పడగా, సుమారు 12 టన్నుల చేపలు కొట్టుకుపోయాయి. దీంతో సుమారు రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. కొరగుంటపాలెం, పెదగొన్నూరు, కోమట్రు తదితర గ్రామాల చెరువుల గట్లు కూడా వర్షాల కారణంగా బలహీనమైనట్లు రైతులు చెబుతున్నారు.

పంట నష్టం నమోదుకు ఉత్తర్వులు : ఏడీఏ

భారీ వర్షాలకు వరి పైరుకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వ్యవసాయ శాఖ మండవల్లి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వెంకటమణి తెలిపారు. సోమవారం ముదినేపల్లి మండలం పేరూరు, పెయ్యేరు, దాకరం, వడాలి గ్రామాల్లో వరి పొలాలను ఏవో వేణుమాధవ్‌తో కలసి పరిశీలించి మాట్లాడుతూ ముంపు నష్టం వివరాల సేకరణ ప్రారంభించామని, రైతులు తమ భూముల వివరాల పత్రాలు, పాస్ బుక్, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి గ్రామాల్లోని వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు.



పేరూరులో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ

తగ్గని తమ్మిలేరు వరద.. రాకపోకలకు వెతలు

చాట్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. తమ్మిలేరులో వరద కొనసాగుతుండటంతో ఏటి ఒడ్డు గ్రామాల మధ్య రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చాట్రాయి మండల రైతులకు చింతలపూడి, లింగపాలెం మండలాల్లో, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయి. వరదల కారణంగా పొలాల్లోకి వెళ్లలేక, పంటల పరిస్థితి తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతే కాక చింతలపూడి ఆసుపత్రులకు వెళ్ళే రోగులు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ముసునూరు: మండలంలో భారీ వర్షాలకు వరద ఉధృతంగా ప్రవహించడంతో పలు రహదారులు కోతకు గురయ్యాయి. ముసునూరు-వలసపల్లి ప్రధాన రహదారి ఊటవాగు ఉధృతికి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అలాగే నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు వరద తీవ్రతకు కోతకు గురై బీటలువారింది. సంధ్యవాగుకు గతంలో ఎన్నడూ లేని విధంగా వరద రావడంతో చెక్కపల్లి వద్ద ప్రధాన రహదారిపై ఉన్న వంతెన కూలి గండిపడింది. 10 రోజులుగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే గ్రామాల్లో ఉన్న అంతర్గత రహదారులకు గండ్లు పడి అధ్వానంగా మారాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం చేసేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.



మండవల్లిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

మండవల్లి, సెప్టెంబరు 9: మండవల్లి పరిధిలో ముంపునకు గురైన ప్రాంతాలను అధికార యంత్రాంగం సోమవారం పరిశీలించింది. ఏలూరు డీఎల్పీవో కేపీ చంద్రశేఖర్ రావు మండవల్లి తహసీల్దార్ గోపాల్, యూపీఆర్‌డి ఆనంద్‌బాబు, మండవల్లి కార్యదర్శి శ్రీనివాసరావు, మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ ముంపు ప్రాంతాల్ని, గృహాల్ని పరిశీలించారు.

18.6 మి.మీ. వర్షపాతం నమోదు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 9: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా గత 24 గంటల్లో 18.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా లింగపాలెంలో 43.4 ఎం.ఎం., ఆగిరిపల్లిలో అత్యల్పంగా 10.4 ఎం.ఎం., చాట్రాయిలో 34.2, నూజివీడులో 18.6, ముసునూరులో 16.8, చింతలపూడిలో 32.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలి

కలిదిండి, సెప్టెంబరు 9 : ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని మండల ప్రత్యేకాధికారి కె.ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.



పునరావాస కేంద్రంలో బాధితులతో ప్రత్యేకాధికారి

సోమవారం పడమటిపాలెం, సున్నంపూడి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి ముంపు బాధితుల సమస్యలడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ముంపు బాధితులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తోందని తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు గ్రామాల్లో ముంపు తగ్గే వరకు పునరావాస కేంద్రాలను కొనసాగించాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో దినతేజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 9 : మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి చేయాలని మండల స్థాయి ఉత్సవాల జేఏసీ సమావేశం నిర్ణయించింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సుబానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మల్లీశ్వరి, ఎస్ఐ వెంకట్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మరియన్న, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ తదితరులు నిమజ్జనోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు, అశ్లీల ప్రదర్శనలు జరగకుండా చూసేందుకు గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులతో టీంలు ఏర్పాటు చేయాలని సుబానీ కోరారు.

నిమజ్జనాలకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

ముసునూరు, సెప్టెంబరు 9: గణనాథుల నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు గణనాథుల నిమజ్జనానికి నిర్దేశించిన తేదీల ప్రకారం ఊరేగింపులు జరపాలని, వీఆర్వో, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్‌లు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఊరేగింపులకు డీజే అనుమతులు లేవని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు సాయంత్రం 5 గంటలలోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో జి.రాణి, డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, సూపరింటెండెంట్ కె.సాయిరాము, హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ.. స్వాధీనం చేసుకున్న నగదు

ఏటీఎం సెంటర్లే టార్గెట్..

కార్డులు మార్చి సొమ్ము కొట్టేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9 : ఏటీఎం సెంటర్లకు వచ్చే అమాయకులను, చదువురాని వారిని ఆసరా చేసుకుని మోసగిస్తున్న ఒక వ్యక్తిని కైకలూరు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కైకలూరు మండలం సింగాపురానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు కైకలూరులో ఆగస్టు 5వ తేదీ ఉదయం ఏటీఎం సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసే సమయంలో అక్కడ ఒక వ్యక్తి ఉండి సహాయం చేసినట్లు నటించి ఆయన ఏటీఎం కార్డును మార్చివేశాడు. కార్డు ఉపయోగించి రూ. 46 వేలు అపహరించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తన సిబ్బందితో నిఘా పెట్టారు. కైకలూరు గాంధీబొమ్మ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోనసీమ జిల్లా పోలవరంలోని దంగుడు బియ్యం వారి వీధికి చెందిన పల్లా సురేంద్ర కుమార్ అలియాస్ సురేంద్ర (32) అనే యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. కైకలూరులోనే మరో కేసులో 60,400 రూపాయలు అపహరించాడని, ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో రూ.20 వేలు ఒక మహిళ ఏటీఎం కార్డు ద్వారా తస్కరించాడని విచారణలో వెల్లడైంది. దీంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. సురేంద్ర కుమార్ వ్యసనాలకు బానిసై క్రికెట్ బెట్టింగులు, జల్సాలకు అలవాటుపడి ఇలాంటి నేరాలు చేస్తున్నాడన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకూ 60 పైగా కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కైకలూరు టౌన్‌లో నమోదైన రెండు కేసుల్లోనూ, ఏలూరు త్రీ టౌన్‌లో నమోదైన కేసులలో మొత్తం 86,400 రూపాయల నగదు రికవరీ చేశామని వెల్లడించారు. డీఎస్పీతో పాటు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ, కైకలూరు టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

ముదినేపల్లి, సెప్టెంబరు 9 : ముదినేపల్లి మండలం వూటుకూరు గ్రామంలో శనివారం జరిగిన పోసిన బాలకోటయ్య హత్య కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హతుడి కుమారుడు చైతన్య ప్రసాద్ పది మందిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయా వ్యక్తులకు, హతుడు బాలకోటయ్య, అతని కుటుంబీలకు ఉన్న లావాదేవీలు ఏమిటి, హత్యలో వారి పాత్ర ఏమిటన్న అంశాలపై దర్యాప్తు అధికారి, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ విచారణ నిర్వహిస్తున్నారు. బాలకోటయ్య సమీప బంధువు ఒకరు హత్యకు పాల్పడ్డాడన్న ఫిర్యాదుతోపాటు అతనికి మరి కొందరు సహకరించారన్న ఆరోపణలపై కూడా విచారణ జరుపుతున్నారు. 3 నెలల క్రితం జరిగిన గొడవను ఆసరాగా చేసుకుని కక్షతో మరీ బాలకోటయ్యను హత్య చేసేందుకు దారి తీసిన బలమైన కారణాలేమిటన్నదే దర్యాప్తులో ప్రధాన అంశం. ఊటుకూరు గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.



చాట్రాయి ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న కూటమి నాయకులు

వైసీపీ నాయకుడిపై కూటమి నాయకుల ఫిర్యాదు

చాట్రాయి, సెప్టెంబరు 9: ఆగిరిపల్లిలో ఇటీవల జనసేన జెండాపై మూత్ర విసర్జన చేసిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని సోమవారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు తుమ్మల జగన్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కె. కోటేశ్వరరావు, కంపసాటి చెన్నారావు, ఆదిమూలం శర్మ, శ్రీమన్నారాయణ, దుర్గాప్రసాద్, అవినాశ్, శోభనాద్రి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు మృతి

వైద్య సిబ్బందే కారణమంటూ ఆందోళన

టి.నరసాపురం, సెప్టెంబరు 9: మండలం లోని బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమ వారం ఒక పసికందు మృతిచెందింది. బొర్రం పాలెం గ్రామానికి చెందిన బాధిత మహిళ రేఖ తెలిపిన వివరాల ప్రకారం పురిటి నొప్పుల రావడంతో ఆది వారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు డెలి వరీకి సమయం పడు తుందని జాప్యం చేస్తూ వచ్చారని సోమవారం సాయంత్రం నాలుగు తర్వాత పురుడు వచ్చింద న్నారు. ఆ తర్వాత తన బిడ్డను జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారని అప్పటికే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసు పత్రికి చేరుకుని బిడ్డ మృతికి కారణం వైద్య సిబ్బందే అని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యవైఖరి వల్ల బిడ్డ మృతి చెందిందని ఆందోళనకు దిగారు.ఈ విషయమై వైద్యురాలు ఇమాంబీని ప్రశ్నించగా బిడ్డకు తల్లి కడుపులో పేగు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఏఎస్ఐ జయకుమార్ వైద్య సిబ్బంది, బాధితులతో చర్చించి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.



పవన్‌కల్యాణ్ ప్రకటించిన చెక్కును అందజేస్తున్న కామినేని



విరాళం చెక్కును మంత్రికి ఇస్తున్న మహిళా సంఘాల సభ్యులు

వరద బాధితులను ఆదుకోవాలి

కైకలూరు, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కైకలూరు నియోజకవర్గం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం కైకలూరులో విలేకర్లతో మాట్లాడుతూ వరద ఉధృతితో అనేక కుటుంబాలు జీవనోపాధిని కోల్పోవడమే గాక పలువురు చనిపోయారని వారి కుటుంబాలను ఆదుకు నేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని దాతలు విరాళాలు అందజేయాలన్నారు. కైకలూరుకు చెందిన విద్యార్థులు ఎల్. ప్రదీప్‌కుమార్, ఎస్. శశి అభినవ్, ఎస్. శశాంక్ తాము సేకరించిన రూ.5 వేలు విరాళాన్ని కామినేనికి అందజేశారు. వీరు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తారని చిన్నారులను కామినేని అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ప్రకటించిన చెక్కుల పంపిణీ

మండవల్లి: మండవల్లి మండలం భైరవపట్నంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముంపు పంచాయతీలకు ప్రకటించిన పరిహారం చెక్కులను సోమవారం కైకలూరు నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలకు కామినేని అందజేశారు. రాష్ట్రంలో ముంపుకు గురైన 400 గ్రామాలకు గాను గ్రామానికి లక్ష రూపాయిల చొప్పున నష్టపరిహారం పవన్‌కల్యాణ్ ప్రకటించారని కామినేని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో మండవల్లి మండలంలో పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక, కొవ్వాడలంక, మణుగులూరు గ్రామాలకు లక్ష రూపాయిల చొప్పున మంజూరైన చెక్కులను ఆయా గ్రామ సర్పంచ్‌లకు కామినేని అందజేశారు. వీటితో పాటు కైకలూరు పంచాయతీకి కూడా లక్ష రూపాయిల చెక్కును కామినేని అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మండవల్లి జడ్పీటీసీ సభ్యురాలు ముంగర వెంకటరమణ, కైకలూరు మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, జనసేన నాయకులు హనుమాన్ ప్రసాద్, బోయిన రాజేష్, చలపతి, కొల్లేరు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బలే ఏసురాజు, కైకలూరు నియోజవకర్గ ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, కొడాలి వినోద్, కొల్లేటిలంక గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు విరాళం అందజేత

నూజివీడు టౌన్: వరద బాధితుల సహాయార్థం మేము సైతం అంటూ మహిళా సంఘాలు ముందుకు వచ్చాయి. నూజివీడు పట్టణం రెండో వార్డుకు చెందిన మెప్మా మహిళా సంఘాలు రూ.50 వేలను సమీకరించి నూజివీడు మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు నేతృత్వంలో మంత్రి పార్థసారథికి అందించారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, ఆర్‌పీలు స్వప్న, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో నీట మునిగిన పంటలు పరిశీలిస్తున్న ఏవో

నీట మునిగిన పంటల పరిశీలన

చాట్రాయి, సెప్టెంబరు 9:మండలంలో భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన పంటలను సోమవారం వ్యవసాయాధికారి శివశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ వరి, పత్తి తదితర పైర్లలో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపాలని సూచించారు. వరిలో వర్షం నీరు తీసిన తరువాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్ళు రాకుండా లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్, లేదా 2 గ్రాముల మాంకోజెబ్ పిచికారి చెయ్యాలన్నారు. పత్తి పంటలో అధిక వర్షం నీరు బయటకు పంపిన తరువాత పంట కోలుకున్న తర్వాత పూత, పిందె దశలో ఉన్నప్పుడు ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను బూస్టర్ మోతాదులో వేయాలని సూచించారు.



చెక్కపల్లి చెరువు వద్ద నాయకులు, పోలీసులు

పెద్ద చెరువు వద్ద బందోబస్తు

ముసునూరు, సెప్టెంబరు 9: మండలంలోని చెక్కపల్లి పెద్దచెరువు కట్ట ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ ఫోర్స్ పోలీసులతో సోమవారం బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు తల్లిబోయిన సత్యనారాయణ, కాటేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ, కందుల పిచ్చియ్య చెరువుకట్ట పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి జల్లులుగా వర్షం పడి, సోమవారం మధ్యాహ్నానికి వర్షం పూర్తిగా ఆగిపోవడం, చెరువులోకి వరదనీరు తగ్గడంతో పెను ప్రమాదం తప్పినట్టేనని, ఒక వేళ భారీ వర్షం కురిస్తే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు అంటున్నారు. పరిస్థితి చక్కబడే వరకు పోలీస్ బందోబస్తు కొనసాగుతుందని ఏఎస్ఐ నాగభూషణరావు తెలిపారు.



పర్వతాపురంలో గణనాథుడికి టీడీపీ నాయకుల పూజలు



కాట్రేనిపాడులో గణనాథుడి నిమజ్జన ఊరేగింపు

బొజ్జ గణపయ్యకు..

పూజలు.. నిమజ్జనాలు

నూజివీడు, సెప్టెంబరు 9: గణనాథుడి ఆశీస్సులతో అన్ని విఘ్నాలు తొలగి, నవ్యాంధ్ర అభివృద్ధిబాటలో పయనించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ఆకాంక్షించారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనాన్ని సోమవారం నిర్వహించారు. గణేష్ లడ్డూని నూజివీడుకు చెందిన లలిత జ్యూయలర్స్ అచ్చేశ్వరరావు రూ.27 వేలకు పాడారు. ఈ నగదును సీఎం సహాయ నిధికి పంపుతున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. విజయవాడ వరద బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద నూజివీడు పట్టణ టీడీపీఈ నాయకులు రూ. 2 లక్షల చెక్కును మంత్రికి విరాళంగా అందించారు.

ముసునూరు: ఉత్సవాల మూడో రోజు సోమవారం నిమజ్జన ఊరేగింపులను వైభవంగా నిర్వహించారు. కాట్రేనిపాడులో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి 15 కేజీల ప్రసాదం లడ్డూను మెగల నాగరాజు, తుమ్మల వెంకటేశ్వరరావు, అశోక్ రూ. 65 వేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించి, స్థానిక పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.

కలిదిండి: కలిదిండిలో చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మందిరంలో భక్తులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కోరుకొల్లు, పెదలంక, మూల్లంక, గుర్వాయిపాలెంలో గణపతికి పూజలనంతరం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముదినేపల్లి: మండలంలో గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో భక్తులు వినాయకుడికి పూజలు చేస్తున్నారు. పలు గ్రామాల్లోని విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముదినేపల్లి, శ్రీహరిపురం, పెదపాలపర్రు, పెదగొన్నూరు, ఉప్పరగూడెం, జానకిగూడెం, వడాలి తదితర గ్రామాల్లో నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు.





ట్రిపుల్ ఐటీలో వాషింగ్ మిషన్ల ఏర్పాటు

నూజివీడు టౌన్, సెప్టెం బరు 9: విద్యార్థుల సౌక ర్యార్థం నూజివీడు ట్రిపుల్ ఐటీలో హాస్టల్‌కు రెండు చొప్పున వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఫైయర్ స్మార్ట్ సొల్యూషన్స్ తరపున ఈ వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేయగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ విద్యార్థులకు అందించారు. ఫైయర్ సంస్థ మేనేజర్ ఎన్.మనోజ్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థల్లో ఇప్పటి వరకు 3 వేల వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు వాటిని పే అండ్ యూజ్ ద్వారా వాడుకోవాలని, దివ్యాంగులకు మాత్రం ఉచితం అన్నారు. ఏవో జి.లక్ష్మణరావు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బ్రహ్మాస్వాములు, దుర్గా భవాని పాల్గొన్నారు.

నేడు కామినేని పర్యటనలిలా..

కలిదిండి: మండలంలో ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. ఉదయం 10 గంటలకు పడమటిపాలెంలో ముంపు బాధితులను పరామర్శిస్తారన్నారు. అనంతరం దుంపలకోడు దిబ్బ, సున్నంపూడి గ్రామాల్లో ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తారన్నారు.

ముదినేపల్లి: మండలంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో ఎమ్మెల్యే కామినేని మంగళవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం నుంచి వణుదుర్రు, దేవపూడి, ఊటుకూరు, వాడవల్లి, పెదగొన్నూరు, ఉప్పరగూడెం గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన వరి పైరును, డ్రైన్లను పరిశీలిస్తారని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు.

ఏఎంసీ మాజీ ఛైర్మన్ అక్కినేని చిట్టిబాబు మృతి



నూజివీడు టౌన్, సెప్టెంబరు 9: నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ అక్కినేని చిట్టిబాబు (75) సోమవారం మృతి చెందారు. దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావ్ అనుచరుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన పోతిరెడ్డిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా, నూజివీడు ఏఎంసీ ఛైర్మన్‌గా పని చేశారు. పాలడుగు వెంకట్రావ్ మృతి చెందిన అనంతరం వైసీపీలో చేరిన ఆయన గ్రామ అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం తుది శ్వాస విడిచారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం...



ముసునూరు, సెప్టెంబరు 9: వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం ముసునూరులో ముంపునకు గురైన వరి, పత్తి పంటలను ఏఈవో రామకృష్ణతో కలసి ఆయన పరిశీలించి మాట్లాడు తూ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను వీఏఏలు, వీహెచ్ఏలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన పంటల వివరాలను నమో దు చేస్తున్నారని, ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక ఇస్తామని తెలిపారు.